# అటాకారీదండ్లు?

రాయసం వెంకటశివుడుగారు

చిన్ననాడు మాయమ్మ మాకు జెప్పిన
కథలలోనెల్ల పూర్వకాలపు దొంగలను
గూర్చినవియె ముఖ్యములు. సాధారణముగ
రాత్రులందె యీ వృత్తాంతములు మాకు
వినవచ్చుచుండెడివి. ఆ నిశ్శబ్ద గాఢాంధ
కారసమయమున నివి యూఁగొట్టి భయ
కంపితులమయిన మా బాల్యచక్షువుల
కపుడు వీధినిపోవు ప్రతి బాటసారి యాకృ
తియు, పెరటనిలిచియుండు ప్రతి చెట్టును
ఒక్కొక గజదొంగవలెఁ గనబడుచుండును!

తన తల్లి ముత్తవతల్లి చిన్నతనమునం
దివి జరిగెనని మాయమ్మమ్మ చెప్పుచుం
డును. కావున నివి సంభవించినది యిప్ప
టికి సుమారిన్నూఱేండ్లు. అప్పటికి బ్రిటీషు
దొరతన మీ ప్రాంతములందు పాదుకొన
లేదు. ఆకాలమున తఱచుగా మరాటీలు,
పిండారీలు దండెత్తివచ్చి దేశమును కొల్ల
గొట్టుచుండువారు. వీరి మూకలను అటా
కారీదండ్లని జనులు చెప్పుకొనుచుందురు.
దండు వచ్చుచున్నదని గ్రామమున దలారి
డప్పు వినబడగనే ఊరంతయు గగ్గోలు పడు
చుండును. ఏపనిచేయువా రపు డాపనిని
గట్టిపెట్టి, పిల్లలను నగలను వెంటగైకొని,
ఊరికి దూరస్థమగు నడవులలోనికి బారి
పోవుచుందురు. ఈ దండు సామాన్యముగ
రాత్రులు వచ్చుచుండుటచేత ప్రాణసంరక్ష
ణకై పారిపోవు జనుల బాధలకు మితిలేదు.
చీకటిలో బెడ్డలలోను ముండ్లలోను బడి,
యలజడితో స్త్రీలు పురుషులు, పిన్నలు
పెద్దలును పలాయితులగుచుందురు.
రాత్రియంతయు నిర్జనప్రదేశములందు
గడిపి, ప్రాణము లెటులో దక్కించుకొని
తెల్లవాఱిన పిమ్మట నూరుసేరిన గ్రామస్థు
లకు కొల్లగొట్టబడి 'భాం' మనుచుండు
తమ యిండ్లు గానబడును. ఈ దోపిడి
గాండ్రు కుటుంబములతో వచ్చెడివారట.
మిడుతలదండు వాలిన పొలమందలి సస్యము
వలెనే రాత్రి దండు కొల్లగొట్టిన గ్రామము
మఱునాటి యుదయమునకు సర్వశూన్యమై
యుండును! ఇంట గాన్పబడిన యేమాత్రపు
విలువగల వస్తువయినను దొంగలు గొని
పోవలసినదె. నగలు, నాణెములు, చెంబులు,
తప్పెలలు, బిందెపోటు వారి వశమగుచుం
డును. లేగలతో పాడి పశువులుకూడ వారి
చేత జిక్కుచుండును. గాదెలలోని ధాన్యా
దులు వలసినంత దొంగలు వెంటఁగొని
పోయి, మిగిలినది పాడుచేయుదురు. వం
టిండ్లలోని పచ్చడులు, నూరుగాయలును
వారిపాలగుచుండును.

దురదృష్టవశమున నింట జిక్కువడిన
మనుష్యులు కంటి కగపడిరా, గృహమం
దెచ్చట డబ్బు దాచియుంచిరో చూపింపు
డని వారిని మరాటీలు మిక్కిలి హింసిం
తురు. చేజిక్కిన చిన్నపిల్లల నొక్కొకప్పుడు
దొంగలు తమవెంట గొనిపోయెదరు. ఏ
డెనిమిదేండ్ల యీడుగల తమ బంధువులపిల్ల
యొకతె గతి యిట్లయ్యెనని మా యమ్మమ్మ
చెప్పునప్పుడు మా సంగతియు నిటులె
యగునేమోయని పిల్లలము మేమును

భీతిల్లి, ముత్తవతల్లి నంటి పట్టుకొని కూర్చుండువారము!

మరాటీలచేతజిక్కి, యిట్టి యవస్థనుండి యదృష్టవశమున దప్పించుకొనిన యింకొక బాలిక ప్రస్తావన మా యమ్మమ్మ తెచ్చునప్పుడు, కొంత తెప్పిరిల్లి మేము వినుచుందుము. పొరపాటున విడిచిపెట్టబడిన బాలిక యొక్కతె మంచముమీద నిదురించుచుండగా ఇల్లుసొచ్చిన యటాకారీలు లేపి, దానిని దమతో గొనిపోదలంచిరట. వారంతట పెరడుసొచ్చి, నగలపాతులుండు చోట్లు పరిశీలింతమని యందలి చెట్ల గామిచుట్టును ప్రదక్షిణముచేసిరి. తమతో నిట్లు తిరిగిన యా యింటివారిపిల్ల తమ్మును వెంబడించుచున్నదని యెంచి, మరాటీ లంత గ్రామము వెడలిపోయిరి. చోరుల కాగడావెలుతురున గనులు తెఱచి నిద్రమేల్కనిన యా బాలికకీ బందెపోటు కథ కలవలె దోచెను. వారితో చెట్లచుట్టును తిరిగినను, ఆపిల్ల క్రొత్తవారి వెంట జనక, నిద్రాపారవశ్యముచే నొక జామిచెట్టు మొదట గూలబడెను. బాలిక యెడబాటునకు వగచుచు గృహస్థులు మఱునాడిలుసేరి చూడగా దొడ్డిలో నొకచెట్టు మొదట నిద్రించెడి తమ పిల్ల కానబడెను. క్రొత్తవారిని జూచి యేడ్చిన యా పిల్లను మఱపించుటకై రాత్రి మరాటీలు దానిచేత నిడిన చిన్నకంచు పాత్ర బాలిక చెంతనే యిపుడు పడియుండెను. మా యమ్మమ్మగారి యింట నఱిగిపోయిన కంచు 'ఆపుఖోరా' నొకటి చిన్ననాడు మేము చూచుచుండువారము. ఎవరికిని దెలియని భాషలో గొన్ని యక్షరములు దానిమీద జెక్కబడియుండెను. ఇది గుజరాతీ లిపియని మావాండ్రు చెప్పుచుండువారు. నాటిరాత్రి యటాకారీలు బాలిక చేత బెట్టిపోయిన కంచుపాత్ర యిదియెయని మే మనుకొనుచుండువారము!

---

## భ్రమ

కంచుకూరి రామభద్రరావుగారు

నీదివ్యవిమలాంఘ్రి
నీరేజయుగముపై
భ్రమరినై పాడంగ
భ్రమపుట్టెనోయి!

అవ్యక్తగానాంత
మానందతన్మయము
మాధుర్యభాగ్యమ్ము
మకరందమచ్చోట నీదివ్య॥

పద్మరాగప్రభలు
ప్రసవించునచ్చోట
బ్రదుకుసుమాళించు
పరిమళంబచ్చోట నీదివ్య॥

దివసావసానమున
తమసానకనుమోడ్ప
నిజమాతృవక్షంబు
నిఖిలాత్మకంబద్ది నీదివ్య॥